# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

## తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి

గురువారం 01 అక్టోబర్ 2026


## ట్రావెల్స్ బస్సు బోల్తా.. 11మందికి గాయాలు

నిద్రమత్తులో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ప్రమాదం..

సూర్యాపేట జిల్లాలో ఘటన

2






## గ్రేటర్ @ 34.2 డిగ్రీలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. బుధవారం నగరంలో గరిష్ట ఉష్ణోగ్రత 34.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 22.6 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 57 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అక్టోబర్ ఆరంభంలోనే ఎండ తీవ్రత పెరగడంతో నగరవాసులు ఉక్కపోతకు గురవుతున్నారు. గురువారం కూడా గరిష్ట ఉష్ణోగ్రత సుమారు 34 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది.




# ఏరో విల్లాస్‌పై హైకోర్టు స్టేటస్‌కో

- 46 విల్లాల నిర్మాణ అనుమతి రద్దు.. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం
- జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలంటూ పిటీషనర్ ఆరోపణలు



**గండిపేటతొలివెలుగు:**

శంషాబాద్ పరిధిలోని ఏరో విల్లాస్ ప్రాజెక్టుకు సంబంధించి 46 విల్లాలపై తెలంగాణ హైకోర్టు స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ అనుమతులు రద్దయినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ అనికేత్ భాటి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. జనవరి 7, 2022న ఇచ్చిన ఆదేశాల పరిధిలో ఉన్న 46 విల్లాల విషయంలో అప్పటి పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేసింది. శంషాబాద్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 48, 49, 60, 61, 63, 84, 85, 86, 87, 88, 89లో నిర్మాణాలకు అనుమతులు రద్దయినప్పటికీ పనులు కొనసాగుతున్నాయని పిటిషనర్ ఆరోపించారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో జీవో నంబర్ 111 నిబంధనలకు విరుద్ధంగా భారీ నిర్మాణాలు చేపడుతున్నారని తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

2

### కోర్టు ఆదేశాలు

- 46 విల్లాల నిర్మాణ అనుమతులు రద్దు
- యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశం
- జీవో 111 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- తదుపరి విచారణ వరకు నిర్మాణాలపై నిషేధం

> "నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అందుకే యథాతథ స్థితి కొనసాగించాలి.
>
> — హైకోర్టు

# ట్రావెల్స్ బస్సు బోల్తా.. 11మందికి గాయాలు




**మోతె, తొలివెలుగు:** హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. మంగళవారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా మోతె మండలం హుస్సేనాబాద్ శివారులో జరిగిన ఈ ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. మోతె ఎస్సై లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మైత్రి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు 33 మంది ప్రయాణికులతో విశాఖపట్టణానికి బయలుదేరింది. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో హుస్సేనాబాద్ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే, డ్రైవర్ నిద్రమత్తులో ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో బస్సు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న గోతిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగంలోని అద్దాలు పూర్తిగా ధ్వంసం కాగా, ముందు వరుసలో కూర్చున్న 11 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సూర్యాపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన 11 మందిలో 9 మందికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అనంతరం బుధవారం ఉదయమే ఇళ్లకు వెళ్లిపోయారు. ఇద్దరు ప్రయాణికుల కాళ్లు విరగడంతో మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్ తరలించారు.

# ఏరో విల్లాస్‌పై హైకోర్టు స్టేటస్‌కో

పిటిషనర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా 2026 జూలై 18న షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఏరో విల్లాస్ ప్రాజెక్టు డెవలపర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. 46 విల్లాల్లో ప్రస్తుతం ఎలాంటి నిర్మాణ కార్యకలాపాలు కొనసాగడం లేదని తెలిపారు. ఆయా విల్లాలు గతంలోనే నిర్మించబడ్డాయని, 2022 జనవరి 7న హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాల నేపథ్యంలో వాటిని కూల్చివేయకుండా అధికారులు నిలిపివేశారని వివరించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రమోద్ సింగ్ వాదిస్తూ.. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఆధారంగా చేసుకుని, నిర్మాణ అనుమతులు రద్దయిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. 46 విల్లాలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు రద్దయిన విషయాన్ని నమోదు చేసుకుంది. అదే సమయంలో 2022 జనవరి 7న ఇచ్చిన ఆదేశాల పరిధిలో ఉన్న 46 విల్లాల విషయంలో, ఆ ఆదేశాలు వెలువడిన తేదీ నాటికి ఉన్న పరిస్థితినే కొనసాగించాలని స్పష్టం చేసింది. ఏరో విల్లాస్ నిర్మాణాలకు సంబంధించి ఇదే అంశంపై దాఖలైన ఇతర పెండింగ్ రిట్ పిటిషన్లను కూడా ప్రస్తుత కేసుతో కలిపి విచారించే అంశంపై హైకోర్టు దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి నుంచి అవసరమైన ఉత్తర్వులు పొందిన అనంతరం కేసును తిరిగి జాబితాలో చేర్చాలని ఆదేశించింది. దీంతో ఏరో విల్లాస్‌లోని 46 విల్లాలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న నిర్మాణ స్థితిపై హైకోర్టు ఆదేశాలు కీలకంగా మారాయి. నిర్మాణ అనుమతులు, జీవో 111 నిబంధనలు, గతంలో ఇచ్చిన న్యాయస్థాన విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# నిమజ్జన లోహ వ్యర్థాలపై నిర్లక్ష్యం.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఉదాసీనత

మహానగరంలో ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా భారీ ఆకారాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తోపాటు భారీ ఉకు కడ్డీలు, గ్రిడ్లు, కలప, అల్యూమినియం సామగ్రిని ఉపయోగించి భారీ విగ్రహాలను తయారు చేస్తారు. కేవలం హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, లుంబినీ పార్ వంటి 38 ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో లక్షలాది విగ్రహాలు నీటిలో కలుస్తాయి. నిమజ్జనం ముగిసిన మరుసటి రోజు నుంచి కేవలం మొకుబడిగా చెత్తాచెదారం, పూజా సామగ్రిని మాత్రమే తొలగిస్తున్న సిబ్బంది, లోహ వ్యర్థాల పట్ల మాత్రం దృష్టి పెట్టడం లేదు. సాధారణంగా ప్రభుత్వ ఆస్తులు, ఉత్సవాల ద్వారా వెలువడే స్క్రాప్‌ను బహిరంగ వేలం ద్వారా విక్రయించి ఆదాయంగా మార్చుకోవాలి. అయితే, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఇప్పటివరకు మెటల్ స్క్రాప్ తొలగింపునకు గానీ, దాని అమ్మకాలకు గానీ ఎలాంటి ముందస్తు టెండర్లు పిలవలేదు. ఏటా ఉత్సవాలు ముగిసిన వారం రోజుల పాటు ఇదే అదునుగా భావించే స్థానిక స్క్రాప్ వ్యాపారులు, అసాంఘిక శక్తులు రాత్రి సమయాల్లో జేసీబీల సహాయంతో, కాచిగూడ, ధూల్‌పేట్, చిక్కడపల్లి ప్రాంతాల దళారులతో కుమ్మక్కై టన్నుల కొద్దీ మెటల్ స్క్రాప్‌ను తరలించుకుపోతున్నారు. అయినా అధికార యంత్రాంగం దళారులతో చేతులు కలిపినట్లుగా చూసిచూడనట్లుగా వ్యవహరిస్తోంది.

**బీపీపీ సిబ్బంది చేతివాటం...**

ఇది మా పరిధి కాదంటే, మాది కాదంటూ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతను నెట్టేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. దీంతో మార్కెట్లో టన్నుల కొద్దీ ఉండే ఇనుము, అల్యూమినియం రేట్లు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, ఈ వ్యర్థాల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయం ప్రైవేట్ వ్యక్తులపాలు అవుతోంది. కేవలం మెటల్ మాత్రమే కాకుండా, విగ్రహాల తయారీలో వాడిన రసాయన పూతలు కలిగిన లోహ భాగాలు సరైన సమయంలో తొలగించకపోవడం వల్ల నీటి నాణ్యత మరింత క్షీణించే ప్రమాదం కూడా ఉంది. ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఇంజనీరింగ్‌లో పనిచేసే కొంద రు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఈ వ్యర్థాలు భారీగా గిట్టుబాటు అయినట్లుగా తెలిసింది. అందుకే టెండర్ల విషయంలో అధికారులు రాజీపడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు 'శాస్త్ర' విద్యార్థులు

**- నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ**

**తొలివెలుగు, సూర్యాపేట :** మండల పరిధిలోని అనంతారంలో ఈ నెల 29న నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికల్లో శాస్త్ర స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 కబడ్డీ విభాగంలో మాధురి, సంజన, కృష్ణ, అండర్-17 ఖో-ఖో విభాగంలో వంశీ, రక్షిత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను శాస్త్ర గ్రూప్ చైర్మన్ మైనం చంద్రశేఖర్, డైరెక్టర్లు కరుణారావు, సునీత, ప్రిన్సిపాల్ జహంగీర్ పాషా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని, జిల్లా స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయ బృందాన్ని యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

# నల్లబెల్లి 'యువ భారత్ ప్రెస్ క్లబ్' కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షుడిగా విజేందర్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ**





**తొలివెలుగు, నల్లబెల్లి :** మండల కేంద్రంలో 'యువ భారత్ ప్రెస్ క్లబ్' నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల ఐక్యత, వృత్తిపరమైన సమస్యల పరిష్కారంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే ధ్యేయంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చెట్టుపెల్లి విజేందర్ (న్యూస్ 9), ప్రధాన కార్యదర్శిగా సట్ల రామకృష్ణ (బెస్ట్ వాయిస్), ఉపాధ్యక్షుడిగా కడియాల విజయ్ కుమార్, కోశాధికారిగా వల్లే రమేష్ యాదవ్ (రైట్స్ మీడియా) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అడ్డ సతీష్, పులి సిద్ధార్థ, చెంచు వినయ్ తదితరులను ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి శ్రమిస్తామని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా పాత్రను బలోపేతం చేస్తామని నూతన అధ్యక్షుడు విజేందర్ పేర్కొన్నారు. విలేకరుల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడేందుకు సమష్టిగా పనిచేస్తామని చెప్పారు.



# నర్సయ్య.. పతకాల పంట

- రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఘనత
- కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి అభినందనలు

**తొలివెలుగు, రామన్నపేట :** తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన ఐదో రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 8వ బెటాలియన్ ఆర్ఐ నోముల నర్సయ్య విశేష ప్రతిభ కనబరిచారు. ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగిన టెన్నిస్ పోటీల్లో ఆయన ఏకంగా మూడు పతకాలను కైవసం చేసుకున్నారు. 50 ఏళ్లకు పైబడిన విభాగం డబుల్స్‌లో స్వర్ణ పతకం, సింగిల్స్‌లో రజత పతకం సాధించగా... 40 ఏళ్లకు పైబడిన విభాగం డబుల్స్‌లో మరో రజతాన్ని గెలుచుకున్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నర్సయ్యను 8వ బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ రాణించాలని, శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కాగా, మూడు పతకాలు సాధించిన నర్సయ్య యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందినవారు కావడంతో స్థానికులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# వర్షపు నీటి తిప్పలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- మధురపురి కాలనీలో ముంపు ప్రాంతాల పరిశీలన
- జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడిన మాజీ కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**తొలివెలుగు, గడ్డిఅన్నారం :** గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని మధురపురి కాలనీ రోడ్డు నంబరు 2తో పాటు మార్కెట్ ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిని వెంటనే తొలగించి, స్థానికులకు ఇబ్బందులు తప్పించాలని బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి అధికారులను కోరారు. కాలనీలో ఏర్పడిన నీటి నిల్వ సమస్యను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షపు నీటి వల్ల కాలనీవాసులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి నీటిని తోడేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్‌లో సూచించారు. గతంలో మధురపురి మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహాతోకు విన్నవించగా, 600 ఎంఎం నూతన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రేమ్‌నాథ్ గౌడ్, మధురపురి మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, ప్రతినిధులు సంజయ్ జాదవ్, జాజు, సైకాంత్, ఖలీం, విజయ్ భాస్కర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.




# నిజమైన పేదలకే 'ఇందిరమ్మ' ఇళ్లివ్వాలి

- తొలి విడతలో కాంగ్రెస్ కార్యకర్తలకే కట్టబెట్టారు
- మండిపడ్డ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చందర్ గౌడ్



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి పక్షపాతం లేకుండా నిజమైన పేదలు, అర్హులకే ఇళ్లను మంజూరు చేయాలని బీఆర్ఎస్ ఆత్మకూర్(ఎం) మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పార్టీలకతీతంగా, డ్రా పద్ధతిలో పారదర్శకంగా ఎంపిక చేసి అందించామని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తొలి విడత ఇందిరమ్మ ఇళ్లను కేవలం తమ పార్టీ కార్యకర్తలకే మంజూరు చేయడంతో నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. రెండో విడతలోనైనా అర్హులను పారదర్శకంగా ఎంపిక చేయాలని, లేనిపక్షంలో ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ యాస ఇంద్రారెడ్డి, నాయకులు కోరె బిక్షపతి, పంజాల వెంకటేష్, మాజీ సర్పంచ్ పర్వతాలు, మామిడి శ్రీనివాస్ రెడ్డి, కోరె వెంకన్న, నాతి రాజు, నాతి స్వామి, మజ్జిగ రాంబాబు, సోలిపురం రామ్ రెడ్డి, యువజన నాయకులు చుంచు నాగరాజు, మహ్మద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి





- రామన్నపేట మండలంలో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీల ఏర్పాటు
- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాలతో నియామకాలు

**తొలివెలుగు, రామన్నపేట :** మండలంలోని బాచుప్పల, సూరారం, కుంకుడుపాముల, తుర్కపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీలను బుధవారం ఎంపిక చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ అధ్యక్షతన ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు, కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పార్టీ జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, బత్తుల కృష్ణగౌడ్, రచ్చ లక్ష్మణ్, ఎండీ అక్రమ్, శంభాల వెంకన్న, సర్పంచ్‌లు మాధవి భూపాల్, బమిటిక శ్రీనివాస్, వరలక్ష్మి పిచ్చిరెడ్డి, మాజీ అధ్యక్షులు లింగస్వామి, శ్రీనివాస్ రెడ్డి, జాన్ రెడ్డి, సైదులు, బొక్క పురుషోత్తం రెడ్డి, దిండిగల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వస్త్రాలతోనే మెరుగైన ఉపాధి

- చేనేత సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి
- ప్రతి కార్మికుడికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- సమావేశంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** ఆధునిక డిజైన్లను రూపొందించడం ద్వారానే చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి లభిస్తుందని జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పురపాలక కేంద్రంలో బుధవారం వెంకటరమణ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు చింతకింది రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏడీ మాట్లాడారు. చేనేత సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దానికి అనుగుణంగా ఎగుమతి చేసే వస్త్రాల తయారీలో కార్మికులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి చేనేత కార్మికుడికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవ కుమార్, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మాజీ అధ్యక్షులు పున్న లక్ష్మీనారాయణ, బల్ల దుర్వాసులు, ఉపాధ్యక్షుడు గుద్దేటి నరసింహ, కార్యదర్శి సుంకి సుదర్శన్, కార్యవర్గ సభ్యులు కుడికాల సుదర్శన్, బింగి నాగమణి, సామల నీలమ్మ, గంగాపురం వెంకటేష్, సుంకి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

- 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- క్రమశిక్షణ, ప్రణాళికతో బోధించాలి
- ఎంఈఓ ప్రభాకర్



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే ప్రధాన వారధులని మండల విద్యాధికారి (ఎంఈఓ) ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక, ఆదర్శ (మోడల్), గురుకుల పాఠశాలలకు చెందిన 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ ప్రభాకర్ ఉపాధ్యాయులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల బోధనపైనే ఆధారపడి ఉంటుందన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రణాళికతో పనిచేస్తే విద్యార్థులకు ఉన్నత విద్యను అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మణిపాల్ రెడ్డి, అంజయ్య, నరేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, కలిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మహాసభను విజయవంతం చేయండి

- అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహణ
- హయాత్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సమావేశం



**తొలివెలుగు, హయాత్‌నగర్ :** ఉస్మానియా యూనివర్సిటీలో అక్టోబర్ 6న నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. హయాత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పీడిత వర్గాల విముక్తి, జాతి భవిష్యత్తు కోసం విద్యార్థి రంగానిదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. చైతన్యవంతమైన విద్యార్థులను రాబోయే ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయడమే ఈ మహాసభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అక్టోబర్ 6న ఓయూలో జరిగే మహాసభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ ఎల్బీనగర్ ఇంఛార్జి ఎర్ర రవీందర్ మాదిగ, ఎమ్ఆర్‌పీఎస్ ఎల్బీనగర్ ఇంఛార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, కో-ఇంఛార్జి క్యాదాస్ సతీష్ మాదిగ, ఎమ్ఆర్‌పీఎస్ హయాత్‌నగర్ మండల అధ్యక్షుడు కొమ్ము శివ మాదిగ, మండల అధికార ప్రతినిధి కొంగరి జానకి రామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# దయానంద్ గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ

- ఇంజాపూర్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్
- అభిమానుల ఆప్యాయతే కొండంత బలం: దయానంద్ గౌడ్

**తొలివెలుగు, ఇంజాపూర్ :** బిజెపి నాయకుడు నోముల దయానంద్ గౌడ్ జన్మదిన వేడుకలు ఇంజాపూర్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దయానంద్ గౌడ్ నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దయానంద్ గౌడ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. జన్మదినం అనేది గత ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయడానికి స్ఫూర్తినిచ్చే సందర్భమని పేర్కొన్నారు. దయానంద్ గౌడ్ అనునిత్యం ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. అనంతరం దయానంద్ గౌడ్ మాట్లాడుతూ.. అభిమానులు చూపించిన ప్రేమాభిమానాలే తనకు కొండంత బలమని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ వేడుకల్లో బీజేవైఎం రాష్ట్ర కోఆర్డినేటర్ నోముల కార్తీక్ గౌడ్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.









# తల్లి, బిడ్డ ఆరోగ్యానికి పోషకాహారమే శ్రీరామరక్ష

- అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన
- పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ శైలజ

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** గర్భిణులకు లోపాల్లేకుండా అందే పోషకాహారమే దివ్యౌషధంలా పనిచేస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ శైలజ తెలిపారు. పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పురపాలక కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ.. గర్భిణులకు చీరలు పంపిణీ చేసి శ్రీమంతాలు జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకుంటేనే తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. విటమిన్లు, ప్రొటీన్లు సమృద్ధిగా లభించే ఆకుకూరలు, గుడ్లు, చేపలు, పాలు వంటి ఆహారాన్ని రోజువారీగా తీసుకుంటూ పోషకాహార లోపాన్ని నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు శోభ, వసంత తదితరులు పాల్గొన్నారు.

# తీగ తెగిపడి.. పాలు తీసుకెళ్లే వ్యాన్ దగ్ధం

- టీ తాగేందుకు వెళ్లిన డ్రైవర్.. తప్పిన ప్రాణాపాయం
- అబ్దుల్లాపూర్ మెట్‌లో ఘటన

**తొలివెలుగు, అబ్దుల్లాపూర్ మెట్ :** విజయవాడ నుంచి హైదరాబాద్‌కు పాలు తీసుకువచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగిపడి వ్యాన్ దహనమైన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం గ్రామానికి చెందిన చింతకుంట జయరాజ్ (51) విజయ పాలు సరఫరా చేసే వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విజయవాడ నుంచి పాలను వ్యాన్ (ఏపీ 39 వీఈ 5007)లో లోడ్ చేసుకుని ఎల్బీనగర్ వచ్చాడు. పాలు దింపిన అనంతరం బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తిరిగి విజయవాడకు బయలుదేరాడు. మధ్యాహ్నం సుమారు 12:50 గంటల ప్రాంతంలో కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ వద్ద టీ తాగేందుకు వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెళ్లాడు. టీ తాగి ఒంటి గంటకు తిరిగి వచ్చేసరికి వ్యాన్‌లో భారీగా మంటలు చెలరేగాయి. పైనుంచి విద్యుత్ తీగ తెగి పార్క్ చేసిన వ్యాన్‌పై పడటంతోనే షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. డ్రైవర్ వాహనంలో లేకపోవడంతో ప్రమాదం తప్పి ప్రాణాపాయం తొలగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. జయరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.